క్లుప్తంగా

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

పుంగనూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులందరికీ కంటి వైద్యపరీక్షలు చేసి, అందులో 37 మంది విద్యార్థినులకు కౌన్సిలర్ రామకృష్ణం రాజు చేతులమీదుగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుద్రాణి, ఉపాధ్యాయులు జీవి.రమణ, చంద్రశేఖర్‌రెడ్డి, అపర్ణ, రమణి, జీవలత తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



చప్పిడిపల్లెలో టీకాలపై అవగాహన కల్పిస్తున్న సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పేర్కొన్నారు. మండలంలోని చప్పిడిపల్లెలో బుధవారం వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షణ కలిగించేందుకు తల్లిదండ్రులు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలపై ఎలాంటి భయాందోళన చెందకుండా సకాలంలో టీకాలు వేయించాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది లక్ష్మీ ప్రసన్న, జమున పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ కోసం తప్పని తిప్పలు



సదుం సచివాలయంలో అప్‌డేట్ కోసం వేచి ఉన్న ప్రజలు

సదుం: ఆధార్ అప్‌డేట్ కోసం మండల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని సచివాలయం, పాలమంద సచివాలయంలో మాత్రమే అప్‌డేట్ చేస్తున్నారు. సిబ్బందికి శాఖాపరమైన పనులు ఉన్నప్పుడు రోజుల తరబడి అప్‌డేట్ ప్రక్రియ నిలిపి వేస్తున్నారు. దీంతో ప్రజలకు సమస్యలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని సచివాలయానికి భారీ సంఖ్యలో ప్రజలు అప్‌డేట్ కోసం వస్తున్నారు. అక్కడ సరైన సౌకర్యాలు లేక వేచి ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులతో పాటు ప్రస్తుతం రైతు సేవా విశిష్ట సంఖ్యకు ఫోన్ నంబరు లింకయిన ఆధార్ అవసరం కావడంతో పెద్ద సంఖ్యలో కేంద్రాలకు తరలివస్తున్నారు. మరిన్ని చోట్ల అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యల్లమ్మ విగ్రహ ప్రతిష్ట



నూతనంగా నిర్మించిన యల్లమ్మ తల్లి ఆలయం

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్లలోని వగళ్ల వారిపల్లె సమీపంలో నూతనంగా నిర్మించిన యల్లమ్మ దేవస్థానంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, చండీ హోమం ఈ నెల 21, 22, 23న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. 21న గంగపూజ, గణపతి పూజ, వాస్తు హోమం, హారతి, 22న యాగశాల ప్రవేశం, విశేష చండీ హోమం, కలశస్థాపన, మృత్యుంజయ హోమం, 23న వేదపారాయణ, పూర్ణాహుతి, ఆలయ సర్వదర్శనం ఉంటుందని ఆయన తెలిపారు.

రాయితీపై సబ్జీ కూలర్లు



రైతులకు సబ్జీ కూలర్ బాక్సుల గురించి వివరిస్తున్న అధికారులు

కుప్పంరూరల్: కుప్పం రైతులకు కూరగాయలు నిలువ చేసుకునే సబ్జీ కూలర్ బాక్సులను రాయితీపై ఇవ్వనున్నట్లు కుప్పం ఉద్యాన శాఖాధికారి డింపు ప్రియ తెలిపారు. ఈ కూలర్లలో 48 గంటల పాటు కూరగాయలు, పూలు, పండ్లు తాజాగా ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. రైతులే కాకుండా చిరు వ్యాపారులకు సైతం ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. 25 కిలోల బాక్స్ రూ.21వేలు, 50 కిలోల బాక్సు రూ.39,900, 100 కిలోల బాక్సు రూ.57 వేలకు 50% రాయితీ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు కుప్పం పట్టణంలోని ఉద్యానశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అనంతరం పట్టణంలోని కార్యాలయంలో సబ్జీ బాక్సుల గురించి రైతులకు డెమో ఇచ్చారు.

అన్నదాతలు 60 రోజుల్లో చేతికొచ్చే కీరదోస పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడినిచ్చే ఈ పంట సాగు క్రమంగా విస్తరిస్తోంది. మండలంలో రైతులు లాభాల నిచ్చే ఈ పంట వైపు దృష్టి సారించారు. ఏడాదంతా సాగు చేసుకోవచ్చన్న ధీమాతో అన్నదాతలు ముందుకెళుతున్నారు. దీంతోపాటు మార్కెటింగ్ సదుపాయం అందుబాటులో ఉంది. ఎకరా విస్తీర్ణంలో సాగు చేస్తే ఏడాదికి రూ.3 లక్షల నికర ఆదాయం చేతికొస్తోంది. దీంతో రైతులందరూ ఈ పంటపై మక్కువ చూపుతున్నారు.




కొలమాసనపల్లి వద్ద సాగులో ఉన్న దోస పంట

అన్నదాత ఆశ..

అరవై రోజుల దోస

- తక్కువ పెట్టుబడి..ఎక్కువ దిగుబడి
- పంటకాలం కేవలం రెండు నెలలే
- స్థానికంగానే విక్రయ సౌలభ్యం
- ఆశాజనకంగా దోసకాయ ధరలు

పలమనేరు: పలు రకాల పంటలు చేసి ఆశించిన ధర లేక ఆందోళనలో ఉన్న రైతన్నలకు తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో తక్కువ సమయంలో సాగయ్యే దోస పంట కల్పతరువులా మారింది. స్థానికమార్కెట్‌లోనే పంటను విక్రయించుకోవడంతో పాటు కూలీల సమస్య తక్కువగా ఉంటుంది. కాబట్టే ప్రస్తుత తరుణంలో దోస సాగు ఎంతో ఉత్తమమని ఉద్యానశాఖ చెబుతోంది. ప్రస్తుతం దోస కిలో రూ.18 నుంచి రూ.20 వరకూ పలుకుతోంది. ఆ లెక్కన టన్ను ధర రూ.18 వేలు. ఎకరానికి 20 టన్నులు పంట పండినా రూ.3.60 లక్షల ఆదాయం వస్తుంది. దీనికి ఖర్చు ఎకరానికి రూ.60 వేలు పోయినా రూ.3 లక్షల నికర ఆదాయం పొందవచ్చు. తీగరకానికి చెందిన దోస గుమ్మడి, అనపలను పోలి ఉంటుంది. ఇందులో తక్కువ క్యాలరీలు, ఎక్కువగా విటమిన్ ఏ, సి ఉంటుంది. దాహాన్ని తీర్చగలిగే గుణం ఉన్న కాయ ఇది. ఇవి చిత్తూరు జిల్లా ఉష్ణోగ్రతకు చాలా అనుకూలంగా ఉంటాయి. ప్రస్తుతం జిల్లాలోని పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, కుప్పం నియోజకవర్గాల్లో ఎక్కువగా సాగవుతోంది. ఇసుకవాటం, ఎర్రటి, ఒండ్రునేలు అనుకూలం. ముఖ్యంగా ఉదజని సూచిక 6.0-6.7 ఉన్న నేలలు పంటకు అనుకూలంగా ఉంటాయి. ఏడాది పొడవునా పంటను సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం పలు హైబ్రిడ్ రకాల విత్తనాలను స్థానికంగా రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాకు 350 గ్రాముల విత్తనాలు సరిపోతాయి.



పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి వద్ద పండిన దోసకాయలు

సాగువిధానం

- ఎకరాకు ఐదు టన్నులు మగ్గిన పశువుల ఎరువును వేయాలి.
- 40 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్, 40 కిలోల నత్రజనినిచ్చే ఎరువులను వాడాలి.
- నత్రజనిని మాత్రం నాటేటపుడు, నాటిన 25 రోజులకు వేసుకోవాలి.
- పొలం సిద్ధం చేసుకున్నాక రెండున్నర మీటర్ల ఎడంతో 60 సెంమీ వెడల్పుగల నీటి కాలువలను తయారు చేసుకోవాలి.
- కాలువకు ఇరువైపులా 30 నుంచి 50 సెంటీమీటర్ల ఎడంతో విత్తనాలను విత్తుకోవాలి.
- పంట ప్రథమ దశలో మళ్లీ కాయ దిగేటప్పుడు మాత్రం నీటిని ఎక్కువగానూ మిగిలిన కాలంలో తక్కువగానూ ఇవ్వాలి.
- పందిరి కూరగాయలకు అవసరమైన సస్యరక్షణ చర్యలను పాటిస్తే సరిపోతుంది.
- కలుపు నివారణకు మెటలాక్లోర్‌ను వాడుకోవాలి.
- పంటలో ఆడపూలు ఎక్కువగా వస్తాయి కాబట్టి పిందె బాగా నిలవడానికి మూడు ఆకుల స్టేజ్‌లో బోరాక్స్‌ను లీటరు నీటికి రెండు గ్రాములు చొప్పున పిచికారీ చేసుకోవాలి.
- పూత రావడానికి ముందు తీగ చివర్లను తుంచడంతో పక్కతీగలు అభివృద్ధి దిగుబడి పెరుగుతుంది.
- యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఎకరాకు నాలుగు నుంచి ఐదు టన్నుల దాకా పంట దిగుబడి సాధించవచ్చు.
- కాబట్టి నీటి లభ్యత తక్కువగా ఉన్న రైతులు తక్కువ పెట్టుబడితో తక్కువ కూలీలతో సులభంగా ఈ పంటను సాగుచేసుకోవచ్చు.

ప్రస్తుతం దోస రైతులకు గిట్టుబాటు



ప్రస్తుతం టమాటా, బంగాళాదుంప, క్యాబేజీ లాంటి పంటలకు ధరలు లేవు. కేవలం దోస రైతులకు మాత్రం మంచి లాభాలున్నాయి. మొన్నటిదాకా టన్ను రూ.15వేలున్న ధర ఇప్పుడు రూ.18 వేల దాకా ఉంది. కాబట్టి రైతులు ఎక్కువగా సాగయ్యే పంటలకు బదులు డిమాండ్ ఉన్న ఇలాంటి పంటలను సాగుచేసుకోవడం మేలు.

– గజేంద్ర, తొప్పనపల్లి, పలమనేరు మండలం



వధూవరులకు పెద్దిరెడ్డి ఆశీర్వాదం



వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వి.కోట: పట్టణంలోని జీఎంఆర్ కల్యాణ మండపంలో బుధవారం జరిగిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తమ్ముడి కుమారుడి వివాహ వేడుకలో మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎంపీపీ యువరాజ్, పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఫొటో పెట్టండి



కలెక్టర్‌ను కలిసిన డేవిడ్, సంఘం సభ్యులు

పలమనేరు: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ ఫొటో పెట్టాలని మాలల సంఘం జేఏసీ అధ్యక్షులు డేవిడ్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి విన్నవించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో మానిటరింగ్ కమిటీ సమావేశాలను తప్పకుండా నిర్వహించాలని కోరారు. దీంతోపాటు మారుమూల ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో పౌరహక్కుల సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. ఎస్సీకార్పొరేషన్ రుణాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, శివాజి, గోవిందు, జయశంకర్ ఉన్నారు.

విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సుధారాణి

రొంపిచెర్ల: రైతు సేవా కేంద్రాల్లో రైతు గుర్తింపు సంఖ్య కోసం వివరాలను రైతులు ఓటీపీతో కూడా నమోదు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. ఆమె బుధవారం బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు యూనిక్ ఐడీ మీద రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబరుతో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. స్థానికంగా అందుబాటులో లేని రైతులు ఓటీపీతో కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు నంబరు వస్తుందన్నారు. ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు యూనిక్ ఐడీ ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలకు ఆర్థిక సాయానికి ఈ యూనిక్ ఐడీ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్, పెట్టుబడి సాయం, పంటల భీమా, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు , యంత్రాలు, అన్నదాత సుఖీభవ, పంట రుణాలపై వడ్డీ రాయితీ యూనిక్ ఐడీ ద్వారానే వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సహాయ కేంద్రం ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్, రైతులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు కార్డులే రైతులకు ఆధారం



కల్లాడులో అవగాహన ర్యాలీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, రైతులు

పలమనేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గుర్తింపుగా అందజేసే విశిష్ట గుర్తింపు కార్డులే రైతులకు ఆధారమని కాబట్టి రైతులు విధిగా పొందాలని పలమనేరు ఏవో సంధ్య సూచించారు. ఇందుకు సంబంధించి మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ కల్లాడు పరిధిలో బుధవారం ఇందుకు సంబంధించిన నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఆమె గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంధ్య మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు. దీనికోసం ఆధార్, పట్టాదారు పాసుబుక్, వీటికి లింకైన మొబైల్ నంబరును ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆర్‌ఎస్‌కే అధికారులకు ఫోన్ చేసి ఓటీపీ ద్వారా సైతం నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఇప్పటిదాకా 18 రెవెన్యూ గ్రామాల్లో 2,542 మంది ఇప్పటిదాకా నమోదు చేసుకున్నట్టు ఆమె తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీవాణి

పులిచెర్ల(కల్లూరు): నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఇద్దరు కల్లూరు హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీవాణి బుధవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్‌కు కల్లూరు నుంచి షాహిస్తా తబుసం, యశ్రబ్ ఎంపికయ్యారని చెప్పారు. ఉపాధ్యాయులు వెంకట సిద్దులు, రాజేంద్ర, వెంకట రమణారెడ్డి అభినందించారు.

కీలపట్లలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

గంగవరం: తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో మండలంలోని కీలపట్ల గ్రామంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను గురువారం నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు ఈ గ్రామంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించినట్టు వారు తెలిపారు. రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించినట్లు వవరించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ మామోగ్రామ్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, అసిస్టెంట్ డైరెక్టర్(పబ్లిక్ రిలేషన్స్) రాజశేఖర్, యశోధర్, నాగరాజు, అభ్యుదయ మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌శర్మ, ఎంఎల్‌హెచ్‌పిడి ఉమామహేశ్వరి, గంగవరం వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పింక్ బస్సు ముందు స్విమ్స్ ఆస్పత్రి వైద్య బృందం (ఇన్‌సెట్) స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఎంపీ నిధులతో కృత్రిమ కాలు

సోమల(పుంగనూరు): ప్రమాదంలో కాలు కోల్పోయి ఇబ్బంది పడుతున్న యువకుడికి ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి నిధులతో కృత్రిమ కాలు ఏర్పాటుకు బుధవారం రూ.75 వేలు ఆర్థిక సాయం అందించారు. సోమల మండలం వల్లిగట్ల పంచాయతీ కూకటివారిపల్లెకు చెందిన గణేష్ ఇటీవల ఎంపీ పివి.మిథున్‌రెడ్డిని కలిసి సమస్యను తెలియజేశారు. స్పందించిన ఎంపీ కృత్రిమ కాలు ఏర్పాటుకు సహకరించారని గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం: రామకుప్పం డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్ విద్యార్థులకు అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్చి 6వ తేదీన 5వ తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9704550107ను సంప్రదించాలని కోరారు.

21న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సదుం: వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిబాబు బుధవారం తెలిపారు. దరఖాస్తుదారులు తమ సర్టిఫికెట్లు, మరో సెట్ అప్లికేషన్‌తో ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

49 యూనిట్లు.. 314 దరఖాస్తులు

రొంపిచెర్ల: బీసీ కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 21న ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి బుధవారం తెలిపారు. మండలానికి 49 యూనిట్లు మంజూరైతే, 314 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ నెల 21న మధ్యాహ్నం ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకర్ల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని చెప్పారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయం, బ్యాంక్ పాసు పుస్తకం, విద్యార్హత ధ్రువ పత్రాలను తీసుకురావాలని కోరారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 21న మండల కేంద్రంలోని ఎంపీడీఓ, వెలుగు కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలాజి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలపేట ఇండియన్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు పెద్దపంజాణి పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారు హాజరుకావాలన్నారు.

కుప్పం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఫలితాలు విడుదల చేస్తున్న కళాశాల నిర్వాహకులు

కుప్పంరూరల్: తమ కళాశాల అటానమస్ హోదా పొందిన తరువాత నిర్వహించిన మొదటి సంవత్సరం బీటెక్ ఫలితాల్లో కళాశాలలోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు బీసీ ఎన్ కళాశాలల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. మొదటి సంవత్సరం ఫలితాలు బుధవారం విడుదల చేశారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఎస్.ఆర్.సుమిత్ర 93.6%, కె.హెచ్.జాహ్నవి పద్మప్రియ 93.5%, మనోజ్ 92.5% మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఆయన చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అటానమస్ హోదా పొందిన మొదటి ఫలితాల్లోనే తమ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఫలితాల విడుదల్లో పరీక్షల పరిశీలకులు డా.వి.బి.చిత్ర, ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, అధ్యాపకులు భాస్కరన్, మాధవన్, సోము తదితరులు ఉన్నారు.

గణిత ఉపాధ్యాయుడికి సన్మానం



క్రిష్టయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు క్రిష్టయ్యను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. త్వరలో ఉద్యోగ విరమణ పొందుతున్న గణిత ఉపాధ్యాయుడు క్రిష్టయ్యకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ లెక్కల్లో విద్యార్థులు వందశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, బాలబాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు లోకనాథరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, దుర్గప్రసాద్, లావణ్య, శైలజ, దేవకి, అమరనాయక్, రమణా రెడ్డి, నరసింహులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

పుంగనూరు: ఛత్రపతి శివాజి జయంతి వేడుకలు బుధవారం పట్టణంలోని హిందూ ఐక్య సంఘాల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఛత్రపతి శివాజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం ఛత్రపతి శివాజీ నామస్మరణ చేస్తూ పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో త్రిమూర్తిరెడ్డి, జగదీష్, చంద్రకళ, మహేంద్రరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు



కుప్పం: శివాజీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కుప్పం: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని శివాజీ సర్కిల్లో ఛత్రపతి శివాజీ జెండాను ఆవిష్కరించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచా పేలుస్తూ అన్నదానం చేశారు.



పుంగనూరులో హిందూ ఐక్య సంఘాల వేదిక నాయకుల మానవహారం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ సుధాకర్ రావు

వి.కోట: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడానికి నిత్యం కొంచెం సమయాన్ని కేటాయించాలని డీపీఓ సుధాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన డీపీఓ మాట్లాడుతూ ఎవరి ఇంటి చెత్తను వారే సంపదలా తయారు చేసుకనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌ను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేసేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, కుప్పం మండల అధికారులు పాల్గొన్నారు.